సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 21 । నవంబర్ । 2024



క్షణికావేశం..
కొందరు సమస్యలను ఎదుర్కోలేక క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.
వివరాలు 8లో ▸



బాధను మరిపించి..
నవాబ్‌పేట మండలం శామగడ్డతండాలో తుల్జాభవాని పండుగ నిర్వహించారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.7 /12.5
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళల్లో చల్లని గాలులు వీస్తాయి. జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు పాలమూరుకు బీసీ కమిషన్ రాక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ కమిషన్ ప్రతినిధి బృందం ఈనెల 22వ తేదీన జిల్లాలో పర్యటించనుంది. జిల్లా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బహిరంగవిచారణ చేపట్టనున్నట్లు కలెక్టర్ విజయేందిర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక, విద్య, వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకునేందుకోవడానికి జిల్లాకు రానున్నట్లు పేర్కొన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మి రానున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు బీసీ సంఘాలు, సంచార జాతులు, ప్రజలు, బీసీ వర్గాలు విద్య, ఉద్యోగాలు, రాజకీయల్లో అవసరమైన రిజర్వేషన్లు, దామాషాపై అభిప్రాయాలు తెలియజేయవచ్చని సూచించారు. ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్, 11 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా, మధ్యాహ్నం 12 గంటలకు వనపర్తి జిల్లా, 2 గంటలకు జోగుళాంబ గద్వాల జిల్లా, 3 గంటలకు నారాయణపేట జిల్లాకు చెందిన వారు అభిప్రాయాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

సరిఫికెట్ల పరిశీలన



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–4 పరీక్షల్లో ఎంపికైన రెవెన్యూ శాఖకు కేటాయించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను జాగ్రత్తగా పరిశీలించాలని డీఆర్‌ఓ రవి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సర్టిఫికెట్ల పరిశీలనను ఆయన తనిఖీ చేశారు. ఎంపికైన 38 మందికి సమాచారం ఇచ్చామని, సర్టిఫికెట్ల పరిశీలన గురువారం కూడా కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.శాంతి కుమార్, కురుమూర్తిగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికయ్యే జిల్లా జట్టు వచ్చే నెల 7 నుంచి 10 వరకు లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే మహిళలు జిల్లావాసులై ఉండాలని, మిగతా వివరాల కోసం 94914 89852 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2,919

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ గరిష్టంగా రూ.2,919, కనిష్టంగా రూ.1,506 ధరలు దక్కాయి. ఈ ఏడాది గరిష్టంగా ఇంత ధర రావడం ఇదే మొదటిసారి. అదేవిధంగా మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,413, కనిష్టంగా రూ.1,831, హంస రకం గరిష్టంగా రూ.2,116, కనిష్టంగా రూ.1,837, పత్తి గరిష్టంగా రూ.6,689, కనిష్టంగా రూ.6,289, వేరుశనగ గరిష్టంగా రూ.6,530, కనిష్టంగా రూ.5,661, రాగులు రూ.2,229, జొన్నలు రూ.5,172 ధరలు లభించాయి.

బాధ్యతలు స్వీకరించిన డీఈఓ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈఓగా ఉన్న రవీందర్ లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీ అధికారులు చిక్కారు. దీంతో ఆయన స్థానంలో వికారాబాద్ జిల్లా విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఇన్‌చార్జి డీఈఓగా నియమించారు.ఈ సందర్భంగా ఆయనకు బీసీటీఏ, టీపీఆర్టీయూ, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్‌తోనే సస్యశ్యామలం

రూ.4వేల కోట్ల వ్యయంతో 6.50 లక్షల ఎకరాలకు నీరిచ్చాం..

- పెండింగ్ ప్రాజెక్టలను రన్నింగ్ ప్రాజెక్టలుగా మార్చాం..
- ఈ ప్రభుత్వం ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదు
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్ నిరంజన్‌రెడ్డితో కలిసి కురుమూర్తిస్వామికి మొక్కులు..
- మార్గమధ్యలో ధాన్యం కేంద్రాల్లో రైతులతో మాటామంతీ.. కొనుగోళ్ల తీరుపై ఆరా



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ మంజూరు చేసిన మొట్టమొదటి ప్రాజెక్ట్ పాలమూరు ఎత్తిపోతల. ఆ ప్రాజెక్టును అడ్డుకోవడానికి కోర్టులో కేసులు వేసి భూసేకరణ కాకుండా అడ్డుకుంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి కేసీఆర్ కృషి చేశారు' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లోని కురుమూర్తిస్వామిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రజనీ తదితరులతో కలిసి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 50 ఏళ్లు కాంగ్రెస్, 16 ఏళ్లు టీడీపీ ఈ జిల్లాకు తాగు, సాగునీరు ఇవ్వలేదు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే పెండింగ్ ప్రాజెక్టలను రన్నింగ్ ప్రాజెక్టలుగా మార్చాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ కింద రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లందించాం అని తెలిపారు. ఇంకా హరీశ్‌రావు ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'కాంగ్రెస్, టీడీపీలు పాలమూరును వలసల జిల్లాగా మారిస్తే.. వలసలను వాపస్ తెచ్చిన చరిత్ర కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీదే.. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేయడం, ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు కట్టడం వల్ల భూగర్భజలాలు పెరిగి ఈ రోజు వ్యవసాయం పండుగగా మారింది. రైతుల క్షేమం కోసం లక్షల కోట్లు ఖర్చు చేసిన నాయకుడు కేసీఆర్.

పాలమూరు పేరును చెడగొడుతున్నారు..

రేవంత్‌రెడ్డికి వచ్చేది రెండే. ఒకటి దేవుళ్ల మీద ఒట్లు పెట్టడం. మరొకటి ప్రతిపక్షాన్ని తిట్టడం. రైతులకు రూ.15 వేల రైతుబంధు ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. అన్ని రకాల పంటలకు బోనస్ అంటూ మోసం చేశారు. రైతు కూలీలకు రూ.12 వేలు అంటూ ఇంతవరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఎంతో ఆత్మీయులు. కానీ పాలమూరు పేరును రేవంత్‌రెడ్డి చెడగొడుతున్నారు.

రేవంత్ సీఎం అయ్యారంటే కేసీఆర్ భిక్షనే..

రైతులకు రూ.41 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఆ తర్వాత రూ.31వేల కోట్లు అని, అనంతరం బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే పెట్టారు. చివరకు చేసింది ఎంత అంటే రూ.17 వేల కోట్లు. 42 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని మాటిచ్చి 20 లక్షల మందికి మాత్రమే చేశారు. సగం కంటే రుణ మాఫీ కాలేదు. త్యాగాల పునాదుల మీద తెలంగాణ తెచ్చింది కేసీఆర్. రైతులకు మేలు జరుగుతుందంటే నా ఎమ్మెల్యే పదవిని సైతం వదులు కోవడానికి సిద్ధపడ్డాను. కానీ పూర్తి రుణమాఫీ చేయడంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్న వ్యత్యాసం ఉంది. ఈ రాష్ట్రానికి రేవంత్ సీఎం అయ్యావంటే అది కేసీఆర్ పెట్టిన భిక్షనే. హైడ్రా మూసీ పేరుతో ఇళ్లను కూలగొట్టడమే తప్ప ఇల్లు కట్టడం తెలియదు రేవంత్‌రెడ్డికి.



ఉద్దాలను దర్శించుకుంటున్న హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత రైతు బంధు రాలేదు..

రేవంత్‌రెడ్డి వరంగల్‌లో సోనియాగాంధీని దేవతన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు సోనియా గాంధీని బలిదేవత అన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పడుతావు. మాట తప్పుడే రేవంత్ రెడ్డి డీఎన్‌ఏలో ఉంది. ఏ విషయంలో కూడా మాట మీద నిలబడలేదు. ఆరు గ్యారెంటీలు అమలుకాలేదు. వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, రూ.2500 మహిళలకు ఇస్తానని చెప్పి నెరవేర్చలేదు. రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత రైతు బంధు రాలేదు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్‌కిట్, బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీ, బీసీ బంధు, దళిత బంధు, ముదిరాజ్‌లు చేపల పిల్లలను కోల్పోయారు. కరోనా సమయంలో మంత్రుల, ఎమ్మెల్యేల జీతాలు బంద్‌పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చిన గొప్ప నాయకుడు కేసీఆర్. అప్పుడు వచ్చిన రైతుబంధు ఇప్పుడు ఎందుకు రావడం లేదు ? కేసీఆర్ తన హయాంలో రైతుల కోసం 24 గంటల కరెంట్ ఇచ్చారు, వాగులపై చెక్‌డ్యాంలు కట్టారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపారు. రైతు సీఎం కేసీఆర్ అయితే, బూతుల సీఎం రేవంత్‌రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు.

ప్రజలపై ఆగ్రహం చూపొద్దని మొక్కా..

కురుమూర్తి స్వామి దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. పాలకుడే దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పితే దైవాగ్రహానికి గురవుతాం. రేవంత్‌రెడ్డి చేసిన పాపానికి ఆ స్వామిని దర్శించుకుని క్షమించమని, ప్రజలపై ఆగ్రహం చూపొద్దని మొక్కా. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రాన్ని పాలించే పాలకుడు ప్రజలను మోసం చేయకుండా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థించా. మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు రావాలని కోరుకోవడం లేదు.. ఎప్పుడు వస్తే అప్పుడు 100 సీట్లతో కేసీఆర్‌ను గెలిపిస్తారు.'



మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, ఆల, రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఆర్‌ఎస్పీ, రజనీ, మన్నె శ్రీనివాస్‌రెడ్డి

ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎంపీ డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఉదండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో మేజర్‌లకు కూడా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూపరిహారం పెంచి రైతులకు న్యాయం చేయాలని, గతంలో ప్రకటించిన ధరలకు ప్రస్తుత భూముల ధరలకు భారీ వ్యత్యాసం ఉందన్నారు. ప్రస్తుత భూముల ధరలకు అనుగుణంగా పరిహారం పెంచి ఇవ్వాలన్నారు. నిర్వాసితులు ఐకమత్యంగా ఉండి తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలని కోరారు. నిర్వాసితుల తరుపున తాము పోరాడుతామని పేర్కొన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ సర్వేకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జూరాల నుంచి ప్రాజెక్టును మొదలు పడితేనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం డీపీఆర్ మార్చిందన్నారు. నిర్వాసితుల సమస్యలను సంబంధిత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు సాహితీ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థత.. ఆందోళనకరం

వంద మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్.. 15 మందికి సీరియస్



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- విషయం బయటకు రాకుండా ఉపాధ్యాయుల ప్రయత్నం
- పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌కు తరలింపు
- నారాయణపేట జిల్లా మాగనూరు జెడ్పీహైస్కూల్‌లో ఘటన



మక్తల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మక్తల్/మాగనూర్: మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 100 విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురికావడం ఆందోళనకరంగా మారింది. బుధవారం మధ్యా హ్న భోజనంలో అన్నం, పప్పు, గుడ్డు పెట్టారు. ఇది తిన్న కొద్దిసేపటికి ఒక్కొక్కరుగా విద్యార్థులు తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ విలవిలలాడారు. అయితే మొదట తేలికగా తీసుకున్న ఉపాధ్యాయులు.. బాధితులు పెరగడంతో ఏఎన్‌ఎం, ఆశాలను పాఠశాలకు పిలిపించి చికిత్స అందించారు. వారు విద్యార్థుల పరిస్థితిని గమనించి స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌ను సైతం పాఠశాలకు పిలిపించారు. ఆయన 17 మంది విద్యార్థులకు చికిత్స అందించి.. అందులో 15 మందిని మెరుగైన వైద్యం కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ప్రియాంక, నందిని, అనిల్, నవ్య, మేఘన, శివ, జగదీశ్, మహేష్, విజయ్, భీమశంకర్, రాకేష్, విజయ్‌కుమార్, మధు, ప్రశాంతి, శివసాయి ఉన్నారు.

అపరిశుభ్రంగా వంట గది..

విద్యార్థులకు వంట చేసేందుకు నిర్మించిన వంట గదితో పాటు పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. చెత్తాచెదారం మొత్తం అక్కడే వేస్తున్న పరిస్థితులు కనిపించాయి. వంట చేసేందుకు వినియోగించిన కూరగాయలు, కారం పొడి తదితర సామగ్రి మొత్తం వంట ఏజెన్సీ వారు ఎప్పటికప్పుడు బయటి నుంచి తీసుకువస్తున్నారని, మెనూ పాటించడం లేదని విద్యార్థులు వాపోయారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి వీరే వంట చేస్తున్నారని, వీరిని మార్చాలని డిమాండ్ చేస్తున్నా.. ఉపాధ్యాయులు మాత్రం వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో విద్యార్థులకు శుద్ధి నీరు అందించే ఫిల్టర్ వాటర్ మిషన్ సైతం మరమ్మతుకు గురైనా బాగు చేయకపోవడంతో.. నిత్యం మిషన్ భగీరథ నీరు తాగుతున్నారు.

ఉపాధ్యాయులకు చెబితే..



మేం రోజు మాదిరిగానే పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశాం. అయితే ఒంటిగంటకు భోజనం చేసి తరగతి గదులకు వెళ్లి కూర్చున్నాం. కొంత సమయానికి కడుపు నొప్పి మొదలైంది. ఈ విషయం మొదట ఉపాధ్యాయులకు చెబితే లైట్‌గా తీసుకుని..పట్టించుకోలేదు.
– మహేష్, 7వ తరగతి

నాణ్యతగా ఉండదు..



మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడం వల్లనే అనారోగ్యానికి గురయ్యాం. ప్రతిరోజు కూడా మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడం లేదు. ఈ విషయమై ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వంట ఏజెన్సీని మార్చి నాణ్యమైన భోజనం అందించాలి.
– జగదీశ్, 7వ తరగతి

వెంటనే స్పందించాం..

విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఉపాధ్యాయులు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి చికిత్స అందేలా చూశాం. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురవడానికి కారణం మధ్యాహ్న భోజనమా అనేది ఇంకా తేలలేదు. దీనిపై స్పష్టత వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
– మురళీధర్‌రెడ్డి, హెచ్‌ఎం

భయపెట్టి.. పైపులతో కొట్టి

ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు దారుణంగా ప్రవర్తించినట్లు తెలిసింది. కడుపు నొప్పి మొదలైన వెంటనే విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా.. తరగతి గదిలో ఉంచి ప్లాస్టిక్ పైపుతో కొట్టి బెదిరించినట్లు కొందరు విద్యార్థులు పేర్కొన్నారు. అయితే 3 గంటల తర్వాత విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో అప్పుడు వైద్యసిబ్బందికి సమాచారం చేరవేశారని ఆరోపించారు. అయితే పాఠశాలలో మొత్తం 598 మంది విద్యార్థులు ఉండగా.. బుధవారం 426 మంది హాజరయ్యారని హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం ఫుడ్ ఇన్‌ఫెక్షన్ అధికారులు నీలమ్మ, శ్రీనివాసులు పాఠశాలను సందర్శించి.. నమూనాలు సేకరించారు.



మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద గందరగోళం..

గడువులోగా అనుమతులు మంజూరు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టీజీఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి మంజూరు చేయాల్సిన అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. టీప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్ వాహనాలు 9 మందికి, షెడ్యూల్డ్ తెగల వారికి 8 మందికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్‌కు, టాటా ఏస్, మారుతి డిజైర్ వాహనాలకు, పెట్టుబడి సబ్సిడీ, సర్వీస్ సెక్టార్ ఒకరికి పావలా వడ్డీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రతాప్, ఎల్‌డీఎం భాస్కర్, భూగర్భజల వనరుల శాఖ డీడీ రమాదేవి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ సురేష్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రఘు పాల్గొన్నారు.


మాతృ మరణాలను తగ్గించాలి

జిల్లాలో మాతృ మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. మాతృమరణాలపై వైద్యాధికారులతో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఆశ కార్యకర్తల నుంచి జిల్లా వైద్యాధికారుల వరకు అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు.డీఎంహెచ్‌ఓ కృష్ణ, సంక్షేమాధికారి జరీనాబేగం, పీఓఎంహెచ్‌ఎం భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

సర్వే వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను డేటా ఎంట్రీ జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. బుధవారం సాయంత్రం మండల లాగిన్‌లకు యాజర్ ఐడీ పాస్‌వర్డ్‌లను ఈడీఎం ఇవ్వనున్నట్లు చెప్పారు. సాయంత్రం డేటా ఎంట్రీ డెమో నిర్వహించి వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో నిర్వహించిన సర్వే వివరాలను ఎన్యుమరేటర్‌లు డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఆ వివరాలను గోప్యతగా ఉంచాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం

మహబూబ్‌నగర్ రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో జిల్లా సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శ్రీనివాస్, అదనపు జిల్లా రూరల్ అభివృద్ధి అధికారి జోజప్ప జెండా ఊపి దివ్యాంగుల క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో అంధుల సీనియర్ విభాగంలో ఎండీ ఇలియాన షాట్‌పుట్, జూనియర్ విభాగంలో అంకిత, శివకుమార్, చెస్ విభాగంలో కార్తీక్, అజయ్‌కుమార్ విజేతలుగా నిలిచారు. శారీరక దివ్యాంగుల విభాగంలో సుగుణ, స్ఫూర్తి, షాట్‌పుట్‌లో నందు, క్యారమ్స్‌లో నందుకుమారి, రజియాబేగం, పారిజాత, చెస్ నందు విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో శేఖర్, ఎ.వెంకటేష్ గెలుపొందారు. బధిరుల విభాగంలో సి.సునీత, స్వరూప, లక్ష్మి ప్రియ, సువర్ణ ప్రథమస్థానంలో నిలిచారు. క్రీడా పోటీలలో బ్రహ్మ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు, సన్నిధి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు, అంధుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యలవాడ గ్రామానికి చెందిన మొగిళ్ల బొబ్బిలి(36) వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపానికి గురయ్యాడు. క్షణికావేశంలో ఇంట్లో నుంచి వెళ్లి పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు పొలంలో తన అక్కకు ఫోన్‌చేసి చనిపోతున్నానని చెప్పాడు. ఆమె కుటుంబసభ్యులకు విషయం చెప్పడంతో పొలం వద్దకు వెళ్లి చూడగా మొగిళ్ల బొబ్బిలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి అన్న లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిప్పంటించుకొని వృద్ధుడు..

కల్వకుర్తిరూరల్: స్థానిక ఇందిరానగర్‌కాలనీకి చెందిన చిత్తారి చంద్రయ్య(60) అనే వృద్ధుడు ఒంటిపై డీజిల్ పోసుకొని బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆరు నెలల క్రితం మృతుడి భార్య అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి చంద్రయ్య ఒంటరిగా ఉంటున్నాడు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈఘాతుకానికి పాల్పడగా కుటుంబ సభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి



జహీర్ (ఫైల్)


అనంతమ్మ (ఫైల్)

అయిజ: గుండెపోటుతో ఒకే రోజు ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన సంఘటన మండలంలోని ఉత్తనూరులో, అయిజ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. మృతుల బంధువులు తెలిపిన వివరాలు... అయిజ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జహీర్ (55) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మండలంలోని ఉత్తనూరు గ్రామానికి చెందిన అనంతమ్మ(60) మంగళవారం రాత్రి ఆమె నివాసంలో గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచింది. ఈ సంఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

లింగాల: అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలోని అంబట్‌పల్లి వైపు నుంచి ఆటోలో బియ్యాన్ని లింగాలకు తీసుకొస్తుండగా గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. పట్టుబడిన బియ్యాన్ని సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



క్షణికావేశం.. కుటుంబాలకు శాపం

క్షణికావేశం.. అనేక అనర్థాలకు మూలం.. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాలకు శాపాలుగా మారుతున్నాయి. చిన్నచిన్న విషయాలకే నేటి యువత ఆత్మహత్యలకు పాల్పడుతోంది. సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించుకోవాలనే తప్పా ఆత్మహత్యే శరణ్యం అంటూ కుటుంబాలను ఇక్కట్ల పాలు చేస్తున్నారు. ప్రేమ వ్యవహారాలు.. ఆర్థిక సమస్యలు.. భార్యాభర్తల గొడవలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కష్టాల్లో ఉన్నవారిని కాస్త ఓదార్చి మనోధైర్యాన్ని ఇస్తే బలవన్మరణాలను ఆపవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటి వరకు 163మంది ఆత్మహత్యలకు పాల్పడటం భయాందోళనకు గురిచేస్తోంది.

రోజురోజుకు పెరుగుతున్న ఆత్మహత్యలు

- ప్రేమ విఫలమై కొందరు, భార్యాభర్తల గొడవలతో మరికొందరు
- ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది
- ఈ ఏడాది జిల్లాలో 163 కేసులు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు ఏదైనా సమస్య వస్తే వాటిని ఎదుర్కొలేక ఆత్మహత్యే శరణ్యమంటూ కుటుంబాలకు దూరమవుతున్నారు. జిల్లాలో చాలామంది క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి తమ నిండు జీవితాలను బలితీసుకుని కుటుంబాలల్లో విషాదం నింపుతున్నారు. ఈ సంస్కృతి రోజు, రోజుకు పెరిగిపోతుండటంతో కొంత ఆందోళన నెలకొందది. ఆత్మహత్యలను నివారించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉంది. ఆత్మహత్యలకు పాల్పడితే జరిగే పరిణామాలపై జిల్లా పోలీసుశాఖతో పాటు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజలకు విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. జిల్లాలో ఈఏడాదిలో ఇప్పటివరకు వివిధ కారణాలతో 163మంది ఆత్మహత్యకు పాల్పడటం భయాందోళనను కలిగిస్తోంది. వీటి నివారణకు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సి ఉంది.

ఆందోళన కలిగిస్తున్నాయి..

జిల్లాలో ఇటీవల జరుగుతున్న ఆత్మహత్యల సంఘటనలు పలువురిని ఆందోళన కలిగించేలా ఉన్నాయి. చిన్నచిన్న విషయాలకు క్షణికావేశంలో ఉరేసుకోవడం, పురుగుమందు తాగడం వంటివి చేసి తనువు చాలిస్తున్నారు. జిల్లాలో చోటుచేసుకున్న ఆత్మహత్యలలో ఎక్కువశాతం భార్యాభర్తల గొడవలు, ప్రేమ విఫలమైందని, ఆర్థిక సమస్యలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారే అధికంగా ఉన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల జరిగిన ఆత్మహత్య సంఘటనలు

- నవంబర్ 19న బల్మూరు మండలం అనంతవరం గ్రామంలో ఓ రైతు అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.
- నవంబర్ 10న నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు గ్రామానికి చెందిన మహిళకు ఓ వ్యక్తి డబ్బులివ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఆమె చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.
- నవంబర్ 9న నాగర్‌కర్నూల్ మండలం ధిలోని మంతటి గ్రామ శివారులో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- అక్టోబర్ 17న జిల్లాకేంద్రంలో ఓ మహిళ వడ్డీ వ్యాపారి మోసం చేయడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

సమస్యలొస్తే ధైర్యంగా ఎదుర్కోవాలి



చిన్నచిన్న కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. సమస్యలొస్తే ధైర్యంగా ఎదుర్కొవాలి. ఆవేశంలో నిర్ణయం తీసుకుని ఆత్మహత్యకు పాల్పడకూడదు. భార్యాభర్తల మధ్య గొడవలు, ప్రేమ వ్యవహారాలకు సంబంధించినవి ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్లలో సంప్రదించాలి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తాం. జిల్లాలో ఆత్మహత్యల నివారణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

నిత్యం ఏదో ఒక చోట..

జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట ఆత్మహత్యలు జరుగుతున్నాయి. చాలావరకు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అవుతున్నప్పటికీ మరికొన్ని ఇతర కారణాల్లో ఫిర్యాదులు చేయకపోవడం గమనార్హం. జిల్లా పరిధిలోని 22 పోలీస్‌స్టేషన్లలో 2023 సంవత్సరంలో 185 ఆత్మహత్య కేసులు నమోదు అయ్యాయి. 2024 సంవత్సరంలో 163 ఆత్మహత్య కేసులు నమోదు కాగా 119మంది పురుషులు, 44మంది స్త్రీలు ఆత్మహత్య చేసుకున్నారు.

పొక్సో కేసులో 20ఏళ్ల జైలు శిక్ష

- రూ.50వేలు జరిమానా
- బాధితురాలికి రూ.5లక్షల పరిహారం

కోస్గి: పొక్సో కేసులో బుధవారంజిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారగార శిక్ష, రూ.50వేలు జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం తెలిపిన వివరాల మేరకు.. కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓగ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న 14ఏళ్ల మైనర్ బాలికను మహబూబ్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ తరుణ్‌కుమార్ ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పాడు. తన అమ్మమ్మ ఊరు, బాలిక ఊరు ఒకటే కావడంతో తరచు గ్రామానికి వచ్చి ప్రేమ పేరుతో బాలికకు దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు. ఈవిషయం గమనించిన బాలిక కుటుంబ సభ్యులు తరుణ్‌ను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ క్రమంలో గతేడాది మే30న అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రిస్తున్న బాలికను పెళ్లి పేరు చెప్పి ఆటోలో ఎక్కించుకుపోయాడు. హైదరాబాద్‌లో ఒక రూంలో బంధించి బాలికను బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. తన కూతురును నమ్మించి మోసం చేసిన యువకుడిపై బాధితురాలి తల్లి అప్పట్లో ఫిర్యాదు చేసింది. మే31న ఎస్సై శ్రీనివాసులు పొక్సో కేసు నమోదు చేశారు. సీఐ జనార్దన్ సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు పూర్వపరాలను పీపీ ఆకుల బాలప్ప కోర్టుకు వివరిస్తూ తన వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ఫోక్సో కోర్టు ఇంచార్జీగా ఉన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ నిందితుడికి కఠిన కారగార శిక్ష, రూ.50వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో బాధ్యతాయుతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు పీపీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే రివార్డులు ఇస్తామని ప్రకటించారు.

గోదాం తగలబెట్టిన దోషుల సంగతేంటి?



పెబ్బేరు రూరల్: స్థానిక మార్కెట్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగి 7 నెలలు గడిచినా నేటికీ నేరస్తులను పట్టుకోలేదని పోలీసుల తీరుపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గురైన మార్కెట్ యార్డు గోదాంతో పాటు కాలిపోయిన సంచులను రాచాల యుగంధర్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారిక లెక్కల ప్రకారం గోదాంలో 12.94 లక్షల గన్నీ బ్యాగులు నిల్వ చేయగా.. అగ్ని ప్రమాదంలో అవి కాలి పోయాయని, వాటి విలువ దాదాపు రూ.10 కోట్లకు పైగానే ఉంటుందన్నారు. అదేవిధంగా 3 గోదాంలు సైతం ఎందుకూ పనికి రాకుండా పోయాయని, వాటి నిర్మాణానికి సైతం రూ.10 కోట్లు ఖర్చవుతుందని, వీటన్నింటికీ బాధ్యులెవరని, ఎందుకు వారిని శిక్షించడం లేదని ప్రశ్నించారు. ప్రమాద ఘటన వివరాలు అడిగితే అధికారులు దాటవేస్తున్నారని, గోదాంలో కరెంట్ కనెక్షనే లేనప్పుడు షార్ట్‌సర్క్యూట్ ఎలా అవుతుందన్నారు. ఘటనకు 3 రోజులు ముందు డీఎస్‌ఓ సెలవుపై వెళ్లడం, పోలీసుల కాలయాపనపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ఘటనకు కారుకులెవరో తేల్చకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి, సంబంధిత మంత్రికి, డీజీపీకి సమస్యను విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్నగౌడ్, నాయకులు సితార వెంకటేశ్వర్లు, రాఘవేందర్, యాదగిరి, రమేష్, మ్యాదరి రాజు, నాగరాజు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ తరలింపు కేసులో ఒకరి అరెస్ట్

అయిజ: నకిలీ మద్యంను విక్రయించే ముఠాలో ఒకరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి అయిజ పట్టణ శివారులో ఇద్దరు వ్యక్తులు కారులో 6లీటర్ల నకిలీ మద్యం తరలిస్తున్నారు. గద్వాల స్టేషన్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. గట్టు మండలంలోని తుమ్మలపల్లెకి చెందిన ఈడిగ చిన్నఉరుకుందు గౌడ్‌ను అరెస్ట్ చేశారు. అదేగ్రామానికి చెందిన బోయ రవినాయుడు, బోయ రమేష్ నాయకుడు, ఈడిగ పెద్ద ఉరుకుందు పరారీలో ఉన్నారు. వాహనాన్ని సీజ్ చేసి మొత్తం నలుగురి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి, ఎస్‌ఐలు వెంకటేష్, వీరేశలింగం పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

- 18 మంది చిన్నారులకు తప్పిన ప్రమాదం
- ఇద్దరికి స్వల్పగాయాలు


సురక్షితంగా బయట పడిన విద్యార్థులు

బిజినేపల్లి : మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు స్కూల్ బస్సును వ్యవసాయ ట్రాక్టర్ ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న 18మంది చిన్నారులకు పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మేదాన్స్ పాఠశాలకు చెందిన బస్సు కొడుపర్తిమిట్టలో 18 మంది చిన్నారులతో వట్టెం మీదుగా బాజీపూర్ వెళ్తుంది. వట్టెం శివారులో మలుపు వద్ద బస్సు వేగం తగ్గించగా వెనుక వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. అదుపు తప్పి ఇరుకుగా ఉన్న రోడ్డు మీద ఒక చెట్టును తాకుతూ మెల్లిగా పొలాల్లో బస్సు బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ భయంతో అక్కడి నుంచి పారిపోయాడు. అటుగా వెళ్తున్న కొందరు ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు అద్దాలను పగలగొట్టి చిన్నారుల్ని బయటికి తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారుల తలలకు స్వల్పగాయాలయ్యాయి. మరి కొందరికి మాత్రం చిన్నచిన్న గీతలుగా రాసుకుపోయాయి. వారిని 108 వాహనాల్లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనకు కారణమైన ట్రాక్టర్‌పై ఫిర్యాదు చేస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

సంఘటనా స్థలానికి డీఈఓ ..

ప్రైవేటు పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలియగానే డీఈవో గోవిందరాజులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. పాఠశాలకెళ్లి ప్రమాదానికి గురైన బస్సులోని విద్యార్థుల వివరాలు సేకరించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులకు ఫోన్‌చేసి ఆరాతీశారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌లను మరోమారు పరిశీలించి, తనిఖీలు చేయాలని లేఖ రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భద్రతా, పరిరక్షణకు అత్యంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు.

సమసమాజ స్థాపనకు కృషి చేద్దాం


మానాజీపేట స్టేజీ వద్ద విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న యువత

ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరూ బాపు బాటలో పయనించి సమసమాజ స్థాపనకు కృషి చేయాలని విశ్రాంత జిల్లా విద్యాధికారి ఎస్.విజయ్‌కుమార్ కోరారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో చేపట్టిన సత్య శోధనయాత్ర మంగళవారం రాత్రి మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడే బస చేసిన ఆయన బుధవారం ఉదయం సోళీపురం మీదుగా వెళ్తుండగా.. మానాజీపేట గేట్ దగ్గర గ్రామానికి చెందిన యువత ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. అక్కడే రైతులను కలిసిన ఆయన జీవన విధానంపై పలు సూచనలు చేశారు. సత్యశోధన యాత్ర అక్టోబర్ 2న అలంపూర్ జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభించామని.. 100 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించి 2025, జనవరి 12న అచ్చంపేట సమీపంలోని ఉమామహేశ్వర ఆలయం దగ్గర ముగుస్తుందని చెప్పారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం చేనేత వస్త్రధారణను ప్రోత్సహించడం, మద్యం, మత్తు పదార్థాల నియంత్రణ, స్వదేశీ వైద్యం (ఆయుర్వేదం)ను ఆదరించడం, సేంద్రియ సాగును ప్రోత్సహించడం, యోగా, పౌష్టికాహారం, ప్రకృతి, పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడటం, పని, సంస్కృతిని పెంపొందించడం, సత్యం, అహింస పునాదులుగా సమసమాజ స్థాపన వైపు అడుగులు వేసేలా ప్రజలు, విద్యార్థులను చైతన్యం చేయడమేనన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం


దగ్ధమైన పెంకుటిల్లు దగ్గర బాధితుడు


కాలిపోయిన ఇంటి సామగ్రి

- ఇంట్లో దాచిన రూ.5లక్షలు అగ్నికి ఆహుతి

మరికల్: షార్ట్‌సర్క్యూట్‌తో ఓ పెంకుటిల్లు దగ్ధమైంది. ఆరేళ్ల పాటు కష్టపడి సంపాదించిన డబ్బులు కళ్ల ముందే అగ్ని ఆహుతి అయ్యాయి. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి ఎలిగండ్లలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎలిగండ్ల గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్లు కష్టపడి కొత్త ఇంటి నిర్మాణం కోసం రూ.5.35లక్షలను జమ చేశాడు. రెండు రోజుల్లో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలనుకున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం ముగించుకొని ఇంట్లో నిద్రించారు. అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కావటంతో ఇంట్లోని సామగ్రికి మంటలు అంటుకున్నాయి. నిద్ర లేచిన కుటుంబ సభ్యులు లేచి బయటకు పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. క్షణాల్లో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు ఇంటి నిర్మాణం కోసం ప్లాస్టిక్ డబ్బాలో దాచిన రూ.5.35లక్షలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించారు.

కణతి మాంసం స్వాధీనం

- తొమ్మిది మంది అరెస్ట్



నిందితులతో అటవీ శాఖ అధికారులు

అచ్చంపేట రూరల్: విద్యుత్ కంచె వేసి అటవీ జంతువు కణితిని వేటాడి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనలో 9 మంది వేటగాళ్లను అరెస్టు చేసినట్లు అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ సుబూర్ తెలిపారు. బుధవారం అచ్చంపేట అటవీశాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని చేదురుబావితండాలో కణితి మాంసం దాచారని విశ్వసనీయ సమాచారంతో అటవీ శాఖాధికారులు సోదాలు నిర్వహించారు. రాజు అనే వ్యక్తి ఇంట్లో కణతి మాంసంను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడితో పాటు జానీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. మరో 7మంది కణితిని వేటాడినట్లు గుర్తించారు. బల్మూర్ మండలం బిల్లకల్ అటవీ సమీపంలో కాశీం అనే వ్యక్తితో పాటు మరికొందరు విద్యుత్ కంచెతో కణతిని చంపారు. చేదురుబావితండాలో మాంసాన్ని విక్రయిస్తున్నారని తెలియడంతో దాడులు నిర్వహించినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు. కణతిని వేటాడిన 9మందిని కల్వకుర్తి కోర్టులో హాజరు పర్చగా నిందితులకు జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. అటవీ జంతువులను వేటాడి చంపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌ఓ హెచ్చరించారు.

మిరపలో సస్యరక్షణ అవసరం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


మిరప పంట

అలంపూర్: మిరపలో సస్యరక్షణ చర్యలు అవసరమని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ సూచించారు. ప్రస్తుతం మిరప పూతదశలో ఉండటంతో వివిధరకాల చీడపీడలు ఆశించి పంటను నష్టపరుస్తున్నాయి. ఈఏడాది జిల్లాలో మిరప విస్తారంగా సాగులో ఉంది. మిరపలో ఆశిస్తున్న చీడలు, పురుగులు, వాటి నివారణను జిల్లా ఇంచార్జీ వ్యవసాయ శాఖాధికారి సక్రియనాయక్ వివరించారు.

ఆకు ముడత..

తామర పురుగుతో ఆకు ముడత వ్యాపిస్తోంది. తామర పురుగులు ఆకు నుంచి రసం పీల్చడంతో ఆకులు పైకి ముడుచుకుపోతాయి. చివరకు ఇవి బోటు ఆకారంలోకి మారిపోతాయి. దీంతో కిరణజన్య సంయోగక క్రియ దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ..

ముందుగా లేత ఆకులు వస్తున్నప్పుడు వేప నూనె 5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత డైఫెంథురాన్ 1గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి

కాయ తొలుచు పురుగు..

కాయ తొలుచు పురుగు లద్దెపురుగులు మిరప కాయలపై చిన్న రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశించి లేత గింజలను తింటాయి. దీంతో నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ..

ఈ పురుగు నివారణకు క్లోరాంత్రినిప్రోల్ 0.3మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వరి తౌడు 10 కిలోలు, బెల్లం పాకం 2కిలోలు, థయోడికార్బ్ 500 గ్రాములు కలపుకొని చిన్నచిన్న ఉండలుగా చేసి పొలంలో సాయంత్రం వేళల్లో చల్లితే ఈ పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చు.



కాయ కుళ్లు తెగులు..

ఈ తెగులు శిలీంధ్రం ఆశించడంతో వస్తోంది. ఈ తెగులు మొదట చిన్నటి నల్లమచ్చలుగా కాయలపై వస్తోంది. కాయ మొత్తం నల్లగా మారి కుళ్లిపోతుంది.

నివారణ..

ఈ కాయ కుళ్లు తెగులు నివారణకు డైఫెనకొనజోల్ 1 మి.లీ లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

జింక్ లోపం..

జింక్ ధాతువు లోపంతో ఆకుల మధ్య ఈనెలు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. కిరణ జన్య సంయోగ క్రియ దెబ్బతింటుంది. జింక్ ధాతువు లోపం ఎక్కువైతే ఆకులన్నీ రాలిపోతాయి.

నివారణ..

ఈ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



ఆకు మచ్చ తెగులు..

ఆకులపై చిన్నచిన్న మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు కలిసిపోయి ఆకులు రాలిపోతాయి.

నివారణ

ఈ తెగులు నివారణకు సాఫ్ 2గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.



చంద్రబాబు భాషకు అర్థాలు వేరు

బాదడమే సంపద సృష్టి!

ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు.. అదేనా నీ సూత్రం?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'సంపద సృష్టి అంటే ప్రజలపై యూజర్ ఛార్జీలు, పన్నులు, టోల్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు బాదడమేనా? మేం సృష్టించిన సంపద మెడికల్ కాలేజీలు, పోర్టులను స్కామ్‌ల కోసం అమ్మేయడమేనా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానన్న ప్రతిసారి ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సంపద సృష్టిస్తా' అన్నది చంద్రబాబు ఊత పదం (కామన్ డైలాగ్)గా మారిందని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు సంపద సృష్టిలో భాగంగా మెడికల్ కళాశాలలను, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులను అమ్మేస్తున్నారు. పోర్టులకు సంబంధించి దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మారిటైం బోర్డు పెట్టి పోర్టుల నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఫైనాన్షియల్ టై అప్ చేశాం. బ్యాంకులు ప్రత్యేకంగా లోన్లు ఇస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కడుతున్న పోర్టులు, మెడికల్ కాలేజీలు భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల సంపద అవుతుంది. నాగార్జునసాగర్ కట్టడానికి అప్పట్లో రూ.600 కోట్లు–రూ.900 కోట్లు అయినట్టుంది. ఇప్పుడు సాగర్ లాంటి ప్రాజెక్టును కట్టాలంటే ఎన్ని వేల కోట్లు కావాలి? ఈ రోజు కట్టే పోర్టులు, వైద్య కళాశాలల విలువ కూడా అంతే. ఇలాంటివి కడితేనే రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం తయారవుతుంది. దీన్ని సంపద సృష్టి అంటారు. చంద్రబాబు మాత్రం సంపద సృష్టి పేరుతో స్కామ్‌లు చేస్తున్నారు. తనకు కావాల్సిన వాళ్లకు పోర్టులు, వైద్య కళాశాలలను అమ్మేస్తున్నారు' అని మండిపడ్డారు. 'కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై టోల్ వసూలు చేస్తున్న మాదిరిగా గ్రామీణ రహదారులపైనా రాష్ట్ర ప్రభుత్వం టోల్ వసూలు చేయాలని అసెంబ్లీలో చంద్రబాబు చెబుతున్నారు. అంటే ప్రయాణికులు రోడ్లపై తిరిగే దానికి యూజర్ చార్జీలు వసూలు చేస్తారట. దీనినే సంపద సృష్టిగా చంద్రబాబు అభివర్ణిస్తున్నారు. పన్నులతో బాదేసి సంపద సృష్టి అంటే ఆశ్చర్యంగా ఉంది. పైగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు రోడ్లపై విపరీతమైన



దుష్ప్రచారం చేశారు. వాళ్ల ఐదేళ్ల కాలంలో రోడ్ల కోసం రూ.24,792.19 కోట్లు ఖర్చు చేస్తే, మా హయాంలో రూ.43,036.28 కోట్లు వెచ్చించాం. ఇంత ఖర్చు చేసినా కూడా దుష్ప్రచారం ఎదుర్కొన్నాం. బాబు మాత్రం నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు' అని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

బినామీలకు దోచిపెట్టేందుకే అసైన్డ్‌పై దుష్ప్రచారం

- అసైన్డ్ భూములపై నిస్సిగ్గుగా అబద్ధాలు.. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మా ప్రభుత్వం రాక ముందు పేరుకే దళితులకు భూమి ఉండేది. దానిని అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ఇంట్లో వాళ్లకు అత్యవసర పరిస్థితులు ఎదురైనా, వారసుల పేరుపైకి బదిలీ చేయాలన్నా అగమ్యగోచర పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకోలేని నిస్సహాయ స్థితిలో శనక్కాయలకు.. పావలాకు, పది పైసలకు వేరే వాళ్లు కొనుక్కొని అనుభవించే వారు.
- మేము అధికారంలోకి వచ్చాక పేదల జీవితాలు మార్చాలని ఆలోచించాం. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూమి ఉన్న వారికి చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తూ సొంత భూములుగా మార్చాం. ఆ సొంత భూములను అమ్ముకుంటారా? వాళ్ల పిల్లలకు ఇచ్చుకుంటారా? వాళ్ల ఇష్టం. ఈ లోగా ఎవరైనా భూములు కొనుగోలు చేసి ఉంటే కూడా అవన్నీ ఒరిజినల్ అసైనీలకు వెళ్లిపోతాయి. వాళ్ల పేరుతోనే పట్టా వస్తుంది. కొన్న వాళ్లకు పట్టా రాదు. ఇలా హక్కులిచ్చి 15.21 లక్షల మంది రైతులకు, పేదలకు మంచి చేస్తే కూటమి నాయకులు నిస్సిగ్గుగా బురద వేస్తున్నారు. మళ్లీ పేదల దగ్గర నుంచి హక్కులు తీసుకోవడానికి అడుగులు వేస్తున్నారు. చట్టాన్ని రద్దు చేయడం ద్వారా వారి హక్కులను రద్దు చేయనున్నారు. ఆ తర్వాత అవే భూములను పెత్తందార్లు 10 పైసలకు, 20 పైసలకు కొనుక్కోవచ్చు. వీళ్లకు మాత్రమే మంచి రేటు ఉండాలి. పేదలకు మాత్రం మంచి రేటు రాకూడదు.
- చంద్రబాబు ఇచ్చిన ఒక మెమో ద్వారా 2.06 లక్షల ఎకరాలను ఉద్దేశ పూర్వకంగా నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టారు. 98 వేల మంది రైతులను నానా కష్టాలకు గురి చేస్తున్నారు. మేము నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించి.. రైతుల భూమిపై చంద్రబాబు చేసిన దాష్టీకం నుంచి విడుదల చేశాం. వారి భూములపై సర్వ హక్కులు కల్పించాం. అది తప్పంటున్నారు.

ఐదేళ్లలో ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చావా?

- చంద్రబాబు హయాంలో ఒక్క నిరుపేద కుటుంబానికి కనీసం ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? మేము 30.60 లక్షల కుటుంబాలకు అక్కచెల్లెమ్మల పేరుపైనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి స్థలాలు ఇచ్చాం. ఇందులో 21 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 9.02 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. మిగిలిన 11 లక్షల ఇళ్లు పునాదులు దాటి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఏకంగా 17 వేల జగనన్న కాలనీల్లో ఏకంగా ఊళ్లే తయారవుతున్నాయి. ఆ ఇళ్లన్నీ పూర్తయితే జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో చంద్రబాబు హౌసింగ్ కార్యక్రమాన్ని ఆపేశారు.
- మా ప్రభుత్వ హయాంలో సిమెంట్, స్టీలు, ఇతర సామగ్రిని సబ్సిడీపై, ఇసుకను ఉచితంగా ఇచ్చే వాళ్లం. ఇవి కాకుండా రూ.35 వేలు పావలా వడ్డీకి రుణంగా ఇచ్చే వాళ్లం. రూ.1.80 లక్షల డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించే వాళ్లం. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిలిపి వేసినందుకు నిరుపేదలందరూ చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకుంటున్నారు. పేదల ఇళ్ల గురించి ఎవ్వరూ పట్టించుకోవట్లేదు. ఎందుకు అసెంబ్లీ నడుపుతున్నారో.. ఎందుకు ప్రభుత్వాన్ని నడుపుతున్నారో వీళ్లకే తెలీదు.

మద్యం, ఇసుక అంతా స్కామ్..

- రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన పనులు పూర్తిగా పక్కకు వెళ్లిపోయాయి. ఎక్కడ చూసినా మాఫియా ముఠాలు దోచుకుంటున్న పరిస్థితి. చంద్రబాబు అధికారంలోకి వస్తే నాణ్యమైన లిక్కర్ ఇస్తానన్నారు. మద్యం రేటు తగ్గిస్తానన్నారు. ఆశ్చర్యం ఏమంటే.. గతంలో చంద్రబాబు హయాంలో అవే డిస్టలరీలు.. మా హయాంలో అవే.. ఇప్పుడు కూడా అవే డిస్టలరీలు. మద్యం ఆదాయంలో చీప్ లిక్కర్ నుంచే 85 శాతం వస్తుంది. చంద్రబాబు వచ్చిన తర్వాత చీప్ లిక్కర్‌లో నాణ్యత తగ్గించారు. ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త బ్రాండ్లను తీసుకొచ్చారు. ఎప్పుడూ మనం వినని, చూడని బ్రాండ్లు అవి.
- అన్ని చోట్లా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో బెల్టు షాపునకు.. ఒక్కో గ్రామంలో పోటీ పెట్టి వేలం వేస్తున్నారు. రూ.2 లక్షలకు పాడుకున్న వాడికే ఇస్తున్నారు. ఇలా మాఫియా రాజ్యం నడుస్తోంది. మద్యాన్ని ఎమ్మార్పీకి అమ్మకోవాలంటే పోటీ ఎందుకు? ఎమ్మెల్యేలు మనుషులను ఎందుకు కిడ్నాప్ చేయించాలి.. ఎందుకు ఎవరినీ పాడనివ్వకుండా చేయాలి? వేరేవాళ్లకు వచ్చినా షాపులు నడుపుకోలేని పరిస్థితికి ఎందుకు నెట్టేయాలి? ఎమ్మార్పీ ప్లస్ మాఫియాకు కమిషన్ రావాలనే ఇదంతా చేస్తున్నారు. ప్రభుత్వం నడుపుతున్న షాపులన్నీ తీసేశారు. ప్రైవేటు మాఫియాను తీసుకొచ్చి అన్ని రకాలు స్కాములకు తెరదీశారు. ఇసుక పరిస్థితి కూడా అంతే. హామీ ఇచ్చినట్లు ఎక్కడా ఉచితంగా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. గతంలో ఆ డబ్బు ప్రభుత్వ ఖజానాకు చేరేది. ఇప్పుడు అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళ్తోంది.

మరిన్ని వార్తలు, వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మోసాలు, అక్రమాలు, వైఫల్యాలు నిలదీస్తే అక్రమ కేసులా?

- సూపర్ సిక్స్‌లు లేవు.. సూపర్‌సెవెన్‌లు లేవు.. మరో వైపు అన్ని రకాలుగా రాష్ట్రం వైఫల్యం చెందింది. ఎవరైనా హక్కుల కోసం, న్యాయం కోసం సోషల్ మీడియాలో ప్రస్తావిస్తే చాలు దారుణంగా వేధిస్తున్నారు. పోలీసులను అన్యాయంగా వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా వాళ్ల నియోజకవర్గాల్లో ప్రైవేటు మాఫియా ముఠాను తయారు చేసి కొట్టిస్తున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమ నిర్బంధాలు (ఇల్లీగల్ డిటెన్షన్) చేస్తున్నారు. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.
- రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని తప్పుడు సంప్రదాయానికి నాంది పలుకుతున్నారు. ఒక వైపు కేసులు పెట్టడం, మరొక వైపు ఎవరైనా మాట్లాడితే అన్యాయంగా దూషించడం. ఇంకొక వైపు దుష్ప్రచారాలు చేయడం. ఇది చంద్రబాబు నైజం. టాపిక్ డైవర్షన్, తప్పుడు ప్రచారం, అబద్ధాలు, మోసాలు చేయడంలో చంద్రబాబు స్పెషలిస్ట్. ప్రత్యర్థుల వ్యక్తిత్వ హననం (క్యారెక్టర్ అసాస్‌నేట్) చేయడంలో ప్రసిద్ధుడు. లక్ష్మీపార్వతితో మొదలు నా వరకు ఎలా ప్రచారం చేశారో చూశాం.

నా చెల్లిపై దుష్ప్రచారం చేసింది చంద్రబాబే

- చంద్రబాబు తప్పుడు ప్రచారంపై గతంలో నా చెల్లెలు షర్మిల ఏమన్నారో చూడండి. (వీడియోను ప్రదర్శిస్తూ..) ఆ వీడియోలో షర్మిల మాట్లాడుతూ.. 'ఎన్బీకే బిల్డింగ్ నుంచి దుష్ప్రచారం జరిగిందని ఐపీ అడ్రస్‌ను బట్టి పోలీసులు చెబుతున్నారు. ఈ వెబ్‌సైట్‌లన్నీ ప్రో టీడీపీ ప్రమోట్ చేసినవే. ప్రత్యర్థులను కించపరిచేవి. ఈ పోస్టింగ్‌లన్నీ బాలకృష్ణ బిల్డింగ్ నుంచి, ప్రో టీడీపీ సైట్‌ల నుంచి జరిగాయంటే బాలకృష్ణకు సంబంధం లేదని నేను ఎలా అనుకోవాలి? సంబంధం ఉంది కనుకే బాలకృష్ణ నా మీద నింద వేశారని, పుకార్లు పుట్టించారని, వాటిని ప్రచారం చేశారని నేను విశ్వసిస్తున్నా. బాలకృష్ణ ఇలా దిగజారుడు తనానికి ఎందుకు పాల్పడ్డారో ఆయనే చెప్పాలి.
- మా ప్రభుత్వ హయాంలో వర్రా రవీంద్రర్‌రెడ్డి పేరిట ఐ టీడీపీ సభ్యుడు ఉదయ్‌భూషణ్ ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి మా అమ్మను, మా చెల్లెలిని తిట్టించాడు. వర్రా రవీంద్రరెడ్డి పెట్టిన కేసు ఆధారంగా ఫిబ్రవరిలోనే ఉదయ్ భూషణ్‌ను ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. చంద్రబాబు ఎంత దారుణమైన నికృష్టుడంటే తన స్వార్థం కోసం ఎవరినైనా సరే వ్యక్తిత్వ హననం చేస్తాడు. వాళ్ల సానుభూతిపరులతో ఫేక్ ఐడీ క్రియేట్ చేయించి, వాళ్లతో మన వాళ్లను తిట్టిస్తాడు. మళ్లీ మనం తిట్టించామని బయట ప్రచారం చేస్తాడు. ఇటువంటి మనిషి ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండడు. చాలా అరుదుగా పుడతారు ఇలాంటి రాక్షసులు. మన కర్మ ఏంటంటే ఈయన మన రాష్ట్రంలో పుట్టడం. చంద్రబాబు నైజం ఎలా ఉంటుందో ఇంతకంటే ఇంకేం చెప్పమంటారు?



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

'ప్రాసిక్యూటర్స్' అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంరెడ్డి



రాంరెడ్డి



కె.శ్రీవాణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్ అండ్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరి రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఈనెల 19న జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేడర్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈమేరకు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ, పి.రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీవాణి (ఏపీపీ గ్రేడ్-1), ట్రెజరర్‌గా ఆర్.రాఘవేందర్, అదనపు కార్యదర్శులుగా కె.శంకర్, జి.ప్రణయ్ ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే మహిళా ప్రతినిధిగా సాంబ దుర్గాబాయ్, సునీతతో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. పీపీల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

నెట్టెంపాడుకు నిలిచిన నీటిపంపింగ్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి నీటిపంపింగ్‌ను బుధవారం నిలిపివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల జలాశయానికి సాయంత్రం 3,500 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 530, ఆర్డీఎస్ లింక్ కాల్వకు 100, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.439 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 730 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 950 క్యూసెక్కుల వరద జలాశయానికి కొనసాగుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 988 క్యూసెక్కులు, కుడి ఎడమ కాల్వలకు 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టులకు 855 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వివరించారు.

ఫుట్‌బాల్‌లో మెరుగైన శిక్షణ ఇవ్వాలి

- శాయ్ అసిస్టెంట్ డైరెక్టర్ నిషా విద్యార్థి
- పాలమూరులో ఖేలో ఇండియా సెంటర్ సందర్శన

మహబూబ్‌నగర్ క్రీడలు: యువ క్రీడాకారులకు ఫుట్‌బాల్ క్రీడలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని హైదరాబాద్ శాయ్ అసిస్టెంట్ డైరెక్టర్ నిషా విద్యార్థి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. ఫుట్‌బాల్ క్రీడాసామగ్రిని పరిశీలించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, ఫుట్‌బాల్ కోచ్ నికేష్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు వడెన్న, నగేష్, పీడీ బాల్‌రాజు ఉన్నారు.



బాధను మరిపించిన పండుగ



శామగడ్డతండాలో పండుగ వాతావరణం

నవాబుపేట: శామగడ్డతండా ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతోంది. దీంతో తండావాసులు ఇళ్లు, భూములు కోల్పోతామన్న బాధతోనే కొన్నేళ్లుగా కాలం గడుపుతూ వచ్చారు. ప్రాజెక్టు పూర్తి కావస్తుందని.. ఇక ఇళ్లు వదిలి పోవాల్సి వస్తుందనే భయంతో ఇంతకాలం పండుగలకు దూరంగా ఉన్నారు. తాజాగా ప్రాజెక్టు పనులు నిలిచి పోవడం.. పైగా ముంపునకు గురైతే వచ్చే పరిహారం సైతం ఇటీవల అందడంతో రెండేళ్లకోసారి జరుపుకొనే తుల్జాభవాని పండుగను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. తండాలో ఏ ఇంట చూసినా పండుగ వాతావరణం కనిపించటం విశేషం.

- ప్రతి కుటుంబానికి రూ.16 లక్షలు.. ఆ ఇంట్లో పెళ్లయిన కుమారులు ఉంటే వారికి కూడా రూ.16 లక్షలు, పెళ్లిడుకు వచ్చిన ఆడపిల్ల ఉండే రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఈ లెక్కన ప్రతి ఇంటికి సుమారుగా రూ.32 లక్షలకు తగ్గకుండా పరిహారం అందింది.

మా కుటుంబానికి రూ.16 లక్షలు..



తండాలో చాలామందిమి హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. తండా ప్రాజెక్టులో ముంపునకు గురవుతుందన్న విషయం తెలియడంతో తండాను వదిలిపోవాలని నిర్ణయించుకొని పనులు చేసుకుంటున్నాం. తాజాగా వచ్చిన పరిహారంతో ఎక్కడైనా నివా సం ఏర్పాటు చేసుకోవాలని ఆలోచిస్తున్నారు.

– దశరథ్‌నాయక్, శామగడ్డతండా

పండుగ జరుపుకోక ఏళ్లయింది..



పండుగ జరుపుకోక ఏళ్లవుతోంది. గతంలో ఓసారి కరోనా.. మరోసారి ఊరు పోతుందన్న భయంతో పండగకు దూరమయ్యాం. తాజాగా పరిహారం అందడం.. పైగా ప్రాజెక్టు పనులు నిలిచిపోవడంతో కాస్త ఉపశమనం కలిగి బాధలను దిగమింగుకొని పండుగ జరుపుకొంటున్నాం. పూర్తిస్థాయిలో ఒక్కసారి పరిహారం అందిస్తే ఏదైన ఉపాధి మార్గం చూసుకుంటాం.

– నరేందర్, శామగడ్డతండా

ఇందిరా మహిళా శక్తి లక్ష్యాలను చేరుకోవాలి



సాతాపూర్‌లో కోడిపిల్లల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

- స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/ తెలకపల్లి/ పెద్దకొత్తపల్లి: ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని చేరుకోవాలని గ్రామీణాభివృద్ధి సంస్థ, శ్రీనిధి, డీపీఎంలు, ఏటీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరా మహిళా శక్తి పథకం అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని.. ఈ మేరకు వ్యక్తిగత, గ్రూప్‌ల వారీగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలన్నారు. ప్రతినెలా టార్గెట్ నిర్ణయించి, ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, శ్రీనిధి అదనపు పీడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

తెలకపల్లితోపాటు వట్టిపల్లి, నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా వట్టిపల్లిలో ఇందిరా మహిళా శక్తి పథకం, శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలించారు. పెద్దముద్దునూర్‌లో శ్రీరామమిల్క్ పార్లర్, హార్డ్‌వేర్, ఫొటోస్టూడియో దుకాణాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. సాతాపూర్, వట్టిపల్లిలో కోడిపిల్లల పెంపక కేంద్రం, తెలకపల్లిలో లేడీస్ టైలర్, డ్రైక్లీనింగ్ రోలింగ్ సెంటర్, మానస కమ్యూనికేషన్, హనుమాన్ ఫ్లెక్సీ సెంటర్ల పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా జిల్లాలో పెరటి కోళ్ల పెంపకాన్ని విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే 12 రకాల వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, ఇందులో మీ సేవా, ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ తదితర యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏపీడీ లక్ష్మీనారాయణ, డీపీఎం అరుణాదేవి, వెంకటేష్, ఏపీఎం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో హరీశ్‌రావు మాటామంతి



మహిళా రైతులు సత్యమ్మ, రాధమ్మతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మదనాపురం: పాలమూరు మట్టిబిడ్డల ఇంటి ఇలవేల్పు శ్రీకురుమూర్తిస్వామి దర్శనానికి బుధవారం వచ్చిన రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండలంలోని లక్ష్మీపురం వద్ద వరి ధాన్యం ఆరబోసుకున్న పలువురు రైతులతో మాట్లాడారు. వారి మాట ముచ్చట ఇలా..

హరీశ్‌రావు: బాగున్నారా.. ఎన్ని ఎకరాల్లో సాగు చేశావ్ అంటూ మహిళా రైతు వాకిటి సత్యమ్మను పలకరించారు.

రైతు వాకిటి సత్యమ్మ: ఏం బాగున్నాం సార్.. మా ఒడ్లు కొంటలేరు.. తేమ వస్తలేదంటూ చెబుతున్నారు. చేసేది ఏమీ లేక ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నం. రేవంత్‌రెడ్డి సార్‌కు ఓటేసి మోసపోయాం.

హరీశ్‌రావు: అవునా..

మరో మహిళా రైతు రాధమ్మ: సార్.. 2,500 రూపాయలు ఇస్తలేరు.

హరీశ్‌రావు: ఇస్తానని మొన్న కురుమూర్తిస్వామి దగ్గర ముఖ్యమంత్రి ఓట్టేసి పోయారు కదా ఇవ్వడం లేదా..

లంబాడీ శాంతమ్మ: సార్.. బస్సులు మా ఊరులో ఆపడం లేదు. ఫ్రీ బస్సు పెట్టింద్రు ఫుల్లుగా జనం ఎక్కుతున్నారు. నా ఒడ్లు కొనకుంటే రెండు రోజుల క్రితం వ్యాపారులకు అమ్ముకున్న.

హరీశ్‌రావు: మా ప్రభుత్వంలో ఎప్పుడైన ఇలా జరిగిందా.. ఇబ్బంది పడ్డారా.. కాంగ్రెస్ పాలన ఇలా ఉంది చూడండి.

దామోదర్‌రెడ్డి: రైతుబంధు ఇస్తలేరు సార్.. ఒడ్లకు బోనస్ లేదు. మాయమాటలు నమ్మి మోసపోయినం.

హరీశ్‌రావు: రైతుబంధు కోసం మన పార్టీ పోరాటం చేస్తుంది. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం. ఆయన వెంట మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు తదితరులున్నారు.

అక్రమ కేసులతో బీఆర్ఎస్‌పై వేధింపులు

- జైలు నుంచి విడుదల అయిన శ్రీకాంత్‌గౌడ్
- పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



శ్రీకాంత్‌గౌడ్‌ను ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జైలు నుంచి విడుదల అయిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్‌ను బుధవారం శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో హరీశ్‌రావు పరామర్శించారు. కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలగొట్టిన అంధుల ఇళ్లను కట్టించు ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు శ్రీకాంత్‌గౌడ్‌పై తప్పుడు కేసు నమోదుచేసి జైలుకు పంపించారని అన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే తప్పుడు కేసులు బీఆర్ఎస్ నాయకులపై నమోదు చేస్తున్నారని అన్నారు. నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

28న అభయాంజనేయస్వామి ఆలయ టెండర్లు

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించి టెండర్లు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఈవో సత్యచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, లడ్డు, పూజ సామగ్రి విక్రయించడానికి టెండర్లు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహిస్తారన్నారు. స్వామివారి ఆలయ ఆవరణలో జరిగే వేలానికి ఆసక్తి గలవారు హాజరుకావాలని సూచించారు.